క్లుప్తంగా

36 మంది ఉద్యోగాలకు ఎంపిక



రేపల్లె: పట్టణంలోని శారదా ఐటీఐ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 36 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బడుగు వెంకట నారాయణ తెలిపారు. ఎంపికైన వారిని ఆయన అభినందించారు. శ్రీకాళహస్తికి చెందిన రాక్‌మెన్ కంపెనీకి 15 మంది, చెన్నైకి చెందిన డైకన్ కంపెనీకి 15 మంది, హైదరాబాద్‌కు చెందిన ఏజీకే కంపెనీకి ఆరుగురు ఎంపికయ్యారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు. జాబ్ మేళాలో ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరావు



రేపల్లె: రేపల్లె డివిజన్ ప్రాథమిక వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ధూళిపూడి రాఘవరావు, వీర గోపీ, కోశాధికారిగా పీతా కల్యాణ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన డివిజన్‌స్థాయి ప్రాథమిక వైద్యుల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అదేవిధంగా సంఘం సభ్యులుగా బ్రహ్మం, యశ్వంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాఘవరావు మాట్లాడారు. ప్రాథమిక వైద్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

నేడు మణిపూర్ ఘటనపై నిరసన

రేపల్లె: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణానికి నిరసనగా రేపల్లె నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సమాఖ్య ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన చేపట్టనున్నట్లు సమాఖ్య నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, మద్దతు తెలపాలని పేర్కొన్నారు.

గీతా జ్ఞాన మందిరంలో అర్ధ ఏకాహం



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలోని గీతాజ్ఞాన మందిరంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం 4వ హరే రామ హరే కృష్ణ అర్ధ ఏకాహం నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. గీతా గురూజీ పందిరి శ్రీశైలం దివ్య ఆశీస్సులతో 12 నెలలు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంకల్పించారు. సామూహిక హారతితో కార్యక్రమం ముగిసింది. వెల్లటూరు, తాతావారిపాలెం, చినపులివర్రు, పెసర్లంక, కిష్కిందపాలెం గ్రామాలకు చెందిన భజన మండళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మందిరం నిర్వాహకురాలు వేములపల్లి వనజాక్షి పర్యవేక్షించారు.

భూ సర్వేకు గ్రామస్తులు సహకరించాలి

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మీ భూమి–మా హామీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు కోరారు. శనివారం కారుమూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే నిమిత్తం సోమవారం నుంచి గ్రామంలో ఇంటింటికి పర్యటించనున్నట్లు చెప్పారు. సర్వేకు గ్రామస్తులు సహకరించి, తమ భూములను క్రమబద్ధీకరించుకుని శాశ్వత భూ రికార్డులు పొందాలని తెలిపారు. సర్వేతో భూ యజమానులకు ఖచ్చితమైన హద్దులు చూపటంతో పాటు శాశ్వత రెవెన్యూ భూ రికార్డుల్లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. దీంతో భవిష్యత్తులో భూ వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఉండవని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: తెనాలి పట్టణ చెంచుపేటలోని ఓ ఇంట్లో జూదం జరుగుతుందన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 17500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటిని మరపించేలా..!

- వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం
- డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- అమల్లోకి వచ్చిన కొత్త మెనూ
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చివేసింది. వసతి గృహ విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇంటి వాతావరణాన్ని తలపించేలా పసందైన భోజనాన్ని అందించేందుకు డైట్ చార్జీలు పెంచింది. నూతన మెనూను అమలు చేస్తోంది.



భోజనం చేస్తున్న విద్యార్థినులు

బాపట్ల అర్బన్: గత ప్రభుత్వం వసతి గృహాలపై సవతి ప్రేమ చూపించింది. తెలుగుదేశం హయాంలో వాటి నిర్వహణ పూర్తిగా చతికిలపడింది. విద్యార్థులకు మెనూ సక్రమంగా అందిన సందర్భాలు లేవు. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిస్తోంది. విద్యార్థులు చదువులో చురుగ్గా రాణించాలంటే ఆరోగ్యం బాగుండాలని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు పౌష్టికాహారం ఇవ్వాలని భావించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల డైట్ కాస్మోటిక్ చార్జీలు పెంచారు. పెరిగిన డైట్ చార్జీలతో వసతి గృహాల్లో వంట మనుషులు రుచిగా భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

బలవర్ధకమైన మెనూ

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూతో వసతి గృహాల విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందుతోంది. చికెన్ బిర్యాని, పూరి, ఇడ్లీ, జీరా రైస్, ఉప్మా సేమియా, పాయసం, రసం, టమాటా బాత్, ఎగ్ టమాటా కర్రీ, చికెన్ కర్రీ లాంటి వంటలతో మూడు పూటలా విద్యార్థులు రుచికరంగా తింటున్నారు.

జిల్లాలో వసతి గృహాలు ఇలా..

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రీ మెట్రిక్ హాస్టల్స్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ 27 ఉండగా ప్రస్తుతం వాటిలో 1,400మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అలాగే బీసీ సంక్షేమ వసతి గృహాలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ మొత్తం 42 ఉండగా 1,013 విద్యార్థులున్నారు. ట్రైబల్ వసతి గృహాలు మొత్తం 10 ఉండగా 1,150 విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ సౌకర్యాలు మెరుగుపడటం మెస్ చార్జీలు పెరగడం నూతనమైన అమలవుతుండటంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి.

గతం.. ప్రస్తుతం..

- గత ప్రభుత్వంలో వసతి గృహాల్లో.. నీళ్ల చారు, ఉడకని అన్నం, రుచి లేని కూర, కనిపించని గుడ్డుతో భోజనం అధ్వానంగా ఉండేది. డైట్ చార్జీలు అరకొర ఇచ్చేవారు. పర్యవేక్షణ కరువై మెనూ సరిగా అమలయ్యేది కాదు. విద్యార్థులు అర్ధాకలితో అలమటించేవారు..
- ప్రస్తుతం వారంలో ఏడు రకాల అల్పాహారం, మూడు రోజులు చికెన్ కర్రీ, ప్రతిరోజూ ఉడక బెట్టిన గుడ్డు, ఉదయం పాలు, వేరుశనగ చిక్కి, రాత్రి భోజనం అనంతరం అరటిపండు ఇస్తున్నారు. హాస్టల్లో మెనూ పక్కాగా అమలవుతోంది. డైట్ చార్జీలు పెరగడంతో విద్యార్థులు పోషకాల విందుతో పసందైన భోజనాన్ని రుచి చూస్తున్నారు.

పక్కాగా మెనూ అమలు



వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో నూతన మెనూను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అందుకు అనుగుణంగా మెనూ పక్కాగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు సంతోషంగా వసతి గృహాల్లో ఉంటున్నారు.

–రాజ్ దిబోర, సాంఘిక సంక్షేమ, సాధికారిక అధికారిణి, బాపట్ల.

భోజనం రుచిగా ఉంది



ఈ సంవత్సరం మా హాస్టల్‌లో భోజనం చాలా బాగుంది. మాకు ప్రతిరోజు రుచికరమైన భోజనం పెడుతున్నారు. స్నాక్స్ తో పాటు రోజూ పౌష్టిక ఆహారం ఇస్తున్నారు. మంచి భోజనం చేస్తున్నాం.


–కె.రాజు, హాస్టల్ విద్యార్థి.

పెరిగిన కాస్మోటిక్ చార్జీల వివరాలు

తరగతి	పాత చార్జీలు(రూ.ల్లో)	కొత్త చార్జీలు(రూ.ల్లో)
3 నుంచి 4	బాలురు రూ.100, బాలికలు రూ.110	రూ.125 రూ.130
5నుంచి 10	బాలురకు రూ.125 బాలికలు రూ.160	రూ.150 రూ.200
ఇంటర్మీడియట్	బాలురు రూ.125 బాలికలు రూ.160	రూ.200 రూ.250

పెరిగిన డైట్ చార్జీల వివరాలు

తరగతి	పాత చార్జీలు(రూ.ల్లో)	కొత్త చార్జీలు(రూ.ల్లో)
3 నుంచి 4	రూ.1000	రూ.1150
5నుంచి 10	రూ.1250	రూ.1400
ఇంటర్ ఆపైన	రూ.1400	రూ.1600



వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఇడ్లీ

భక్తి శ్రద్ధలతో మొహర్రం



భట్టిప్రోలులో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

భట్టిప్రోలు: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం పండుగ వేడుకలను శనివారం మండలంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. పీర్లను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పీర్లను దర్శించుకుని, మత పెద్దల సూచన ప్రకారం ప్రార్థనలు చేశారు. రెండు రోజుల క్రితం నిప్పుల గుండంలో తిరగడానికి పీర్లను అందంగా అలంకరించారు. పీర్ల చావిడి వద్ద ప్రార్థనలు జరిపారు. మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ పండుగను పీర్ల పండుగ అని కూడా అంటారు.

కృష్ణమ్మ కోత..

వరదలతో కోతకు గురవుతున్న పంట భూములు



ఓలేరు పల్లెపాలెంలో నివాస గృహాల వద్దకు చేరిన వరదనీరు

భట్టిప్రోలు: కృష్ణమ్మ బిరబిరమంటూ పరవళ్లు తొక్కుతుంటే..కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల రైతుల ఆందోళన చెందుతున్నారు. గత నాలుగైదేళ్లుగా ఏటా వరదలు గ్రామాలను ముంచెత్తుతున్నాయి. కృష్ణా నదిలో వరదలు వచ్చినప్పుడు మండలంలోని ఓలేరు పల్లెపాలెం పక్కనే ఉన్న రేవులో వరద నీరు పారుతుంది. దీంతో పంట భూములు కోతకు గురవుతున్నాయి. వరదల కారణంగా పంట భూములు రేవులో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెపాలెం వద్ద పది మంది రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూమి ఉండగా అది నేడు 15 ఎకరాలకు చేరిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అవగతమవుతుంది. పెదపులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతుల పంట పొలాల్లో పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వరుసగా వరదలు రావడంతో రేవుని ఆనుకుని ఉన్న భూములు పటిష్టతను కోల్పోయి కోతకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. అలాగే పల్లెపాలెంలోని రేవు అంచున నివాస గృహాలు కూడా కోతకు గురవుతున్నాయి. వరదల ప్రభావం లేకపోతే భూములకు దన్నుగా చెట్టు, చేమ పెరిగి పటిష్టంగా ఉంటాయని చెబుతున్నారు.

శాంతించిన కృష్ణమ్మ

వరదల కారణంగా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ శనివారం శాంతించడంతో లంక గ్రామాల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాల కారణంగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు వరద ముంపనకు గురయ్యాయి. ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకుల డొంక వద్ద వరద నీరు వెనుకకు మళ్లింది. ఓలేరు పల్లెపాలెం వద్ద శుక్రవారం 9 అడుగుల మేర వరద నీరు ప్రవహించగా శనివారం 6 అడుగులకు చేరింది. పరిస్థితిని వీర్వోలు మంద్రు జక్రయ్య, ఎస్.రాంబాబు, వీఆర్ఏలు సమీక్షించారు.



ఓలేరు పల్లెపాలెంలో కోతకు గురైన పసుపు పంట పొలం



తగ్గిన వరద ప్రవాహం

సూపర్ కిడ్ అవార్డ్‌కు పల్లెకోన చిన్నారి

భట్టిప్రోలు: లిటిల్ చాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా, లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న జాతీయ పురస్కార వేడుకల్లో సూపర్ కిడ్ అవార్డ్‌ను మండలంలోని పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు కైతేపల్లి షాలేమ్‌రాజు–జ్యోత్స్న దంపతుల కుమారుడు యశ్వన్‌రాయ్ అందుకోనున్నాడు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి తెలంగాణ సారసత్ పరిషత్ వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 40 మందికి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. సూపర్ కిడ్–2023 అవార్డ్‌ను కైతేపల్లి యశ్వన్‌రాయ్ అందుకోనున్నాడు. ఈ మేరకు నిర్వాహకులు బుచ్చేశ్వరావు–వసుంధర ఉత్తర్వులు పంపారు. చిన్నారుల్లో ఉండే ప్రతిభను వెలికి తీసేందుకు లిటిల్ చాంప్స్ అకాడమి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.

శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి



కొల్లి వెంకట సుబ్బమ్మ (ఫైల్)

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమికి చెందిన శతాధిక విశ్రాంత ఉపాధ్యాయురాలు కొల్లి వెంకటసుబ్బమ్మ (101) శనివారం మృతి చెందారు. గత ఫిబ్రవరి 1న ఆమె జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా జరిపారు. పదేళ్ల చిరు ప్రాయంలోనే అదే గ్రామానికి చెందిన అవుతు రమణారెడ్డితో ఆమె వివాహం జరిగింది. కొద్ది రోజులకే భర్త కబడ్డీ ఆడుతూ మరణించారు. అనంతరం దుగ్గిరాలలో 8వ తరగతి వరకు చదివిన వెంకటసుబ్బమ్మ.. 1951లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1953న నరసాపురంలో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అదే ఏడాది దుగ్గిరాల మండలం మంచికలపూడిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విద్యాబోధన ప్రారంభించారు. అనంతరం అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలో 1955లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి 23 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయురాలిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రస్తుతం తన సోదరుడు కొల్లి సుబ్బారెడ్డి దగ్గరే ఉంటున్న వెంకటసుబ్బమ్మ మరణించే వరకు కూడా ఎవరి సాయం లేకుండా.. తన పనులు తానే చేసుకుంటున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ..ఇద్దరికి గాయాలు

కర్లపాలెం: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని యాజలి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన సక్కా చిన బాబు తన టీవీఎస్ మోపెడ్‌పై అల్లూరి వైపు వెళ్తున్నాడు. చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెట్ల గోపీకృష్ణ బైక్‌పై కర్లపాలెం వైపు వస్తుండగా యాజలి సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఎదురెదురుగా వారు ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులిద్దరినీ 108 అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారని, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తీసుకెళ్లినట్లు ఎస్ఐ ఎం.శివయ్య వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్లపాలెం: ఆటో ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన గుంటూరు జీజీహెచ్‌లో చోటు చేసుకుంది. కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు వివరాల మేరకు.. మండలంలోని దుండివారిపాలెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి(72) ఈ నెల 13న వ్యక్తిగత పనుల నిమిత్తం సైకిల్‌పై కర్లపాలెం వచ్చాడు. బాపట్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో సైకిల్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లురెడ్డిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంకటేశ్వర్లురెడ్డిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం జీజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్ఐ సాంబశివరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు



ఎంపీడీఓకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం: స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్‌గా నియమితులైన బొలగాని శ్రీనివాసరావుకు ఎంపీడీఓ శేషమాంబకు శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆయన గతంలో సాక్షరభారత్ మండల కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు కృషి



మాట్లాడుతున్న ఏలియా

బాపట్ల: విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు కృషి జరుగుతోందని బీటీఏ గౌరవాధ్యక్షుడు గడ్డం ఏలియా పేర్కొన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ 23వ ఆవిర్భావ కార్యక్రమం సందర్భంగా స్థానిక ఏబీఎం హైస్కూలులో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏలియా మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు, సమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం



ఓఆర్ఎస్ ప్లకార్డులతో వైద్యులు రెడ్‌క్రాస్ బాధ్యులు

తెనాలి: రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ, హ్యాపీ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. హాస్పటల్‌లో ఏర్పాటైన సభలో పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ వాతావరణ మార్పులతో పిల్లలు, పెద్దల్లో వచ్చే మార్పులను వివరించారు. విరోచనాలు, జ్వరం, నోరు తడారిపోవటం, మూత్రం తక్కువగా వస్తూ, రంగు మారిపోవడం, వాసన రావడం, చర్మం పొడిబారటం, కళ్లు తిరగటం, స్పృహ కోల్పోవటం, గుండె అతివేగంగా కొట్టుకోవటం వంటి లక్షణాలు గుర్తించిన వెంటనే ప్రపంచ ఆరోగ్య సంస్థచే గుర్తింపును పొందిన ఓఆర్ఎస్‌ను ముందుగా తాగించాలని సూచించారు. అప్పటికీ ఏ మార్పులు కనిపించకపోతే, దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ, వర్షాకాలం సీజనులో వచ్చే వ్యాధులపై అవగాహన కోసం సదస్సును ఏర్పాటుచేసినట్టు చెప్పారు. హ్యాపీ హాస్పటల్ సిబ్బంది నందు, సాంబయ్య, నాగరాజు, పూజ, అను, లక్ష్మి, డాక్టర్లు ఉష, అశోక్, సత్యనారాయణ, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాగరాజు

తెనాలి: నిరుపేద విద్యార్థికి చదువుకు ఆర్థికసాయం చేయడం గొప్పవిషయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. రూరల్ మండలం కొలకలూరులో గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మూల్పూరు బ్యూల చదువకు సారీకుమార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు చిలువూరు నాగరాజు శనివారం రూ.10 వేలు అందజేశారు. సారీకుమార్ జ్యోతిరావు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకుని పేదవిద్యార్థుల చదువుకు ఆర్థికసాయం అందజేస్తున్నారని ధర్మారావు మాదిగ చెప్పారు. అంబేడ్కర్ వైజ్ఞానిక విప్లవ సంస్థ వ్యవస్థాపకుడు నాగరాజు మాట్లాడుతూ పేదరికం కారణంగా చదువుకోలేని వారికోసం తన తండ్రి పేరుతో ట్రస్ట్‌ను స్థాపించి, దాతల సహకారంతో సహాయం అందజేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిక శ్రీనివాసరావు, జిల్లా సమాచార హక్కు చట్టం సభ్యుడు కట్టా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

గౌతమ బుద్ధా రోడ్డులో ఆంబోతుల బీభత్సం

వృద్ధురాలికి గాయాలు



మంగళగిరి: నగరంలోని ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డుపై శనివారం రాత్రి రెండు ఆంబోతులు బీభత్సం సృష్టించాయి. వాహనదారులను భయభ్రాంతులకు గురి చేశాయి. అదే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై పొడుచుకుంటున్న ఆంబోతులను చూసి దూరంగా తన ద్విచక్ర వాహనాన్ని ఆపేసినా ఆంబోతులు ఒక్కసారిగా పొడుచుకుంటూ వెళ్లి ద్విచక్ర వాహనంపై పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి వెనుక కూర్చొన్న వృద్ధురాలికి గాయాలయ్యాయి. రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ఆటోపై పడటంతో ఆటో అద్దం ధ్వంసమైంది. నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా

మంగళగిరి: వైఎస్సార్ నేతన్న నేస్తంతో రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని, నేతన్న నేస్తం ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ అంజన్ కర్నాటి అన్నారు. వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న ప్రపంచ చేనేత సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి కొరకు ప్రభుత్వంలో చేనేతలను భాగస్వాములు చేయడంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు ఎమ్మెల్సీలు, ఆప్కో చైర్మన్, వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్లుగా నేతన్నలను నియమించడం ప్రశంసనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధి రమేష్ మునుకుంట్ల, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్త అరెస్ట్

తెనాలిరూరల్: భార్యను వేధిస్తున్న భర్తను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. తెనాలి మండలం ఎరుకలపూడికి చెందిన లక్ష్మీబిందుకు 2021లో నరసరావుపేట మండలం బరంపేటకు చెందిన కఠారి చంద్రతో వివాహమైంది. సంతానం కలగడంలేదని, ఇతర కారణాలతో భార్యను తరచూ మానసిక, శారీరక హింసలకు గురి చేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంటేశ్వర్లు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ముగిసిన మహిళల యోగా శిక్షణ శిబిరం

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళల యోగ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరంలో ముగింపు సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు మేదూరు శ్రీనివాసమూర్తి బెజ్జ మహాదేవి కథను వివరించారు. ఆయనను సత్కరించారు. శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, మాతాజీ, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.